క్లుప్తంగా

జిల్లాలో తడిసిన ధాన్యం 120 మెట్రిక్ టన్నులు

గోపాలపురం: వర్షానికి రబీ ధాన్యం తడిసి రంగు మారినా, మొలకలు వచ్చినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుల అధైర్య పడాల్సిన పని లేదని జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా 120 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందన్నారు. పంట నష్టంపై జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌కు సమాచారం అందించినట్టు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పలుచోట్ల కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసింది. మండలంలోని లోతట్టు ప్రాంతాలైన చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.మాధవరావు ఈ గ్రామాల్లో పర్యటించారు. తడిసిన ధాన్యంపై ఐదు శాతం ఉప్పు ద్రావనాన్ని పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ధాన్యం పట్టుబడికి గోనె సంచులు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

పంచాయతీరాజ్ డీఈ సాంబానాయక్ మృతి


సాంబా నాయక్ (ఫైల్)

కొవ్వూరు: పంచాయతీరాజ్ కొవ్వూరు డివిజనల్ ఇంజినీర్ బి.సాంబానాయక్ (55) ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకినట్టు ఇటీవలే గుర్తించారు. అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో ఆదివారం గుంటూరు జిల్లా, దుగ్గిరాలలోని తన స్వగృహంలో సాంబా నాయక్ మృతి చెందినట్టు ఇక్కడి ఆ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయన మృతదేహానికి సోమవారం దుగ్గిరాలలో అంత్యక్రియలు నిర్వహిస్తారన్నారు. అనారోగ్యంగా కారణంగా మార్చి 28 నుంచి ఆయన సెలవుపై వెళ్లారు. సుమారు నాలుగేళ్లుగా కొవ్వూరులో పనిచేస్తున్న సాంబా నాయక్‌కు సౌమ్యుడిగా పేరుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి పంచాయతీరాజ్ డివిజనల్ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

కంటైనర్‌ను ఢీ కొట్టిన ధాన్యం లారీ


హైవేపై ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీ కొట్టిన ధాన్యం లోడ్ లారీ

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఆగి ఉన్న కంటైనర్ లారీని, ధాన్యం లోడు లారీ ఢీ కొట్టింది. ధాన్యం లోడుతో ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి కాకినాడ జిల్లా పెద్దాపురం వెళుతున్న లారీ వెనుక నుంచి కంటైనర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో లారీ ముందు భాగం దెబ్బతింది. లారీ డ్రైవర్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డాడు.

చెట్టును ఢీకొన్న ఆటో: ముగ్గురికి గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని తాళ్లపాలెం వద్ద ఆటో రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నిడదవోలు చెందిన వర్ధనపు జయలలిత, సలీమా, సంధ్యారాణి, చైతన్యలు కలసి తాడేపల్లిగూడెం మండలం ఆరుగొల్లులో ఆదివారం ఒక శుభకార్యానికి వెళ్లి ఇంటికి వచ్చేందుకు నవాబుపాలెం వంతెన వద్ద ఆటో ఎక్కారు. తాళ్లపాలెం వచ్చేసరికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో పాటు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకోవడంతో ఆటో చెట్టును ఢీకొట్టినట్లు క్షతగాత్రులు తెలిపారు. గాయపడిన జయలలిత, సలీమా, సంధ్యారాణిలను స్థానికులు 108లో నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో తరలించగా ప్రాథమిక వైద్య సేవలు అందించారు. సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై నాగరాజు తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో ఆదివారం వీధి కుక్కలు ముగ్గురిపై దాడి చేశాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కూడా కుక్కలు కరవడంతో పలువురు గాయాల పాలయ్యారు. గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం యామర్తి అరవాలరాజు, పూనక మహాలక్ష్మి అనే ఇద్దరిని కుక్క కరిచింది. మరోచోట పనులకు వెళుతున్న పాకా పాపపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వారిని చికిత్స నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నల్లజర్లలో కంటి వైద్యశిబిరం

నల్లజర్ల: భగవాన్ సత్యసాయి సేవాసమితి, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నల్లజర్లలోని నల్లూరి వెంకటపతి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.68 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 14 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 12 మందికి కళ్లజోళ్లు అందజేశారు. భగవాన్ సత్యసాయి సేవాసమితి కనీ్వనర్ ఘంటా శివరామారావు, సేవాదళ్ సభ్యులు, వైద్య బృందం పాల్గొన్నారు.

కళ్లంలో ధాన్యం.. అన్నదాత కలవరం

- అకాల వర్షానికి తడిసిన రబీ వరి
- ఆరబెట్టిన పంటకు నష్టం
- ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు, స్తంభాలు
- విద్యుత్తు సరఫరాకు అంతరాయం


కొవ్వూరు శివారు తడిసిన ధాన్యపు రాశుల వద్ద రైతుల ఆందోళన


దేవరపల్లి మండలం యర్నగూడెంలో రోడ్డుపై ఆరబెట్టిన తడిసిన ధాన్యం


యర్నగూడెంలో తడిసిన ధాన్యం బస్తాలు

కొవ్వూరు: రబీ పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర జేసింది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. వర్షానికి కొవ్వూరు శివార్లలోని సుమారు ఐదు లారీల ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యింది. అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రబీ ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో సుమారు 20 మంది రైతులు పట్టణ శివార్లలోని లే-అవుట్లల్లో ఆరబెట్టారు. ఎవరూ ఊహించని విధంగా తెల్లవారుజామున వర్షం కురవడంతో రైతులు తేరుకునే లోపు ధాన్యం తడిసిపోయింది.ధాన్యపు రాశుల చుట్టూ నీరు నిలిచిపోవడంతో ఒబ్బిడి చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. వారం రోజులుగా మొరపెట్టుకుంటున్నప్పటికీ అధికారులు సకాలంలో గోనె సంచులు ఇవ్వలేదని రైతులు ఆరోపించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఇప్పటికే 30 శాతం గోనె సంచులు ఇచ్చినట్టు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. స్థానిక అధికారులు మాత్రం సోమ, మంగళవారాల్లో గోనె సంచులను ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా అన్నిచోట్లా రైతులు ఇదే రకమైన సమస్య ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నందున అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయాధికారి పరిశీలన

జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఆదివారం ఏడీఈ చంద్రశేఖర్, ఏవో ఏ.గంగాధరరావులతో కలిసి మండలంలోని వేములూరు, కుమారదేవం, కొవ్వూరు ప్రాంతాల్లో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం మొలక రాకుండా తక్షణమే ఐదు శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఇప్పటికే ట్రిప్ షీట్స్ పొందిన రైతులు తక్షణమే కొనుగోలు కేంద్రాలను ధాన్యాన్ని చేరవేసుకోవాలని మాధవరావు సలహా ఇచ్చారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఈదురుగాలుల ప్రభావంతో వాడపల్లి, ఔరంగాబాద్ ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని దేచెర్ల, ఐ.పంగిడి, అన్నదేవరపేట తదితర ప్రాంతాల్లో ఆరుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడడంతో 11 ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో కొవ్వూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని తాళ్లపూడి, చాగల్లు మండలాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు రెండు నుంచి మూడు గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, సరఫరాను పునరుద్ధరించారు.


తాళ్లపూడి మండలం బల్లిపాడు వద్ద తడిసిన పచ్చి ఇటుకలు

తాళ్లపూడి: తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. రబీ ధాన్యం తడిపోవడంతో పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా చేపట్టారు. కోసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై, పంట చేలల్లో ఆరబెడుతున్నారు. ఒక్క సారిగా వర్షం కురవడంతో రైతులు బరకాలతో కప్పి ఉంచారు. కళ్లాల్లో మొక్కజొన్న పొత్తులు కూడా తడిసిపోయాయి. ఇటుక బట్టీల్లోని మట్టి ఇటుకలు తడిసి దెబ్బతిన్నాయి.

ఆరబెట్టిన ధాన్యం వర్షార్పణం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని పలుచోట్ల ఆదివారం వేకువజాము 4 నుంచి 6 గంటల వరకూ ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దాంతో మామిడి కాయలు నేల రాలాయి. రోడ్లపైన, కళ్లాల్లో ఉంచిన ధాన్యం రాసులు తడిసిపోయాయి. గుండుగొలను-కొవ్వూరు హైవేపై సర్వీసు రోడ్లపై నల్లజర్ల నుంచి కొవ్వూరు వరకూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. ఆరిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించి ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రవాణా చేస్తున్నారు. వరుసగా రెండు రోజులు సెలవులు కావడంతో మిల్లులకు వెళ్లిన లారీలు తిరిగి రాలేదు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నందున మరో రెండు రోజులు ఆరబెట్టి తీసుకు రావాలని ఆర్‌బీకే అధికారులు చెప్పడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ఉంచారు. తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి ధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయినట్టు గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం గ్రామాల రైతులు తెలిపారు. అలాగే పల్లంట్లలో కళ్లాల్లో ఎండబెట్టిన ఎండుమిర్చి అక్కడక్కడా తడిసిపోయాయన్నారు. బరకాలు కప్పి ఉంచడం ఎండుమిర్చి పెద్దగా తడవలేదని రైతులు తెలిపారు. అకాల వర్షానికి ధాన్యం, మొక్కజొన్న, మిరప పంటలకు నష్టం వస్తుందని రైతులు వివరించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

వరి పంట కోయాలా? వద్దా

- సందిగ్ధంలో రైతులు
- పెరిగిన కూలీలు, వరికోత యంత్రాల రేట్లు


పెరవలి మండలం పిట్టల వేమవరంలో వరి కుప్ప వేస్తున్న కూలీలు

పెరవలి: ఆదివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న రబీ పైరు తడిసిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో పంటను కోస్తే పరిస్థితి ఎలా ఉంటుందో, కోయకుండా అలాగే ఉంచేస్తే మొత్తానికే మోసం వస్తుందేమో అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. కొంతరు ధైర్యం చేసి యంత్రాల సాయంతో వరి పంటను కోయిస్తుంటే, మరికొందరు కూలీలతో కోయిస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో విత్తనం కోసం వేసిన 3 వేల ఎకరాల పంట ఇప్పటికే ఒబ్బిడి అయ్యింది. ఇంతవరకూ నియోజకవర్గంలో 35 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. మరో 65 శాతం పంట ఒబ్బిడి చేయవలసి ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. అకాల వర్షం కురవడంతో ఇప్పటికే తడిసిన ధాన్యాన్ని ఏ విధంగా ఒబ్బిడి చేసుకోవాలా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన కళ్లాలోని ధాన్యాన్ని కూలీల సాయంతో రోడ్లపైకి తెచ్చి ఆరబెడుతున్నారు. తేమ శాతం ఉన్నప్పటికీ ధాన్యం పాడవకూడదనే ఉద్దేశంతో కూలీలకు అధిక రేట్లు చెల్లించి ఒబ్బిడి చేస్తున్నారు. సాధారణంగా రోజుకు రూ.600 ఉండే కూలి రేట్లు ఇప్పుడు రూ.1000 వరకూ పెరిగింది. వరికోత యంత్రాలదీ అదే పరిస్థితి. ఇప్పటివరకూ ఎకరం విస్తీర్ణంలో పంటను కోసినందుకు రూ.2,500 వసూలు చేసిన యంత్రాల యజమానులు ఇప్పుడు ఒక్కసారిగా రూ.3 వేలకు పెంచేశారు.

ఇటుక బట్టీలకు..

ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు అకాల వర్షాల వల్ల నష్టపోయామని, ఇప్పుడు మరోసారి లక్షలాది పచ్చి ఇటుకలు తడిసిపోవడంతో దెబ్బతిన్నాయని ఇటుక తయారీదారులు వాపోతున్నారు. పెరవలి మండలంలో 108 ఇటుక బట్టీలు ఉన్నాయి. అన్నిచోట్లా పచ్చి ఇటుకకు నష్టం వాటిల్లింది.

కూలీలతో ఒబ్బిడి చేయించాను



పండిన ధాన్యం కళ్లంలో ఉన్నాయి. మళ్లీ వర్షం ముప్పు పొంచి ఉండడంతో కూలీలను పెట్టి ధాన్యాన్ని రోడ్డుపైకి తెచ్చాను. ఒక్కో కూలీకి రోజుకి రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి వచ్చింది. ఈ ఏడాది దిగుబడి బాగున్నందున కొంత మిగులుతుందని భావించాను. పరిస్థితి మారి, పెట్టుబడి పెరగడంతో నష్టం లేకుండా బొటాబొటీగా గట్టెక్కుతాను.

– అల్లంరాజు రైతు పెరవలి

మా ఆశలపై నీళ్లు చల్లింది



కూలిపనికి వెళితే పొట్ట నిండుతుంది. నాలుగు డబ్బుల వెనకేసుకుందామని ఎకరం పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఈ అకాల వర్షం మా ఆశలపై నీళ్లు చల్లింది. పంట ఏమవుతుందోనని ఆందోళనగా ఉంది.

– పెచ్చెట్టి ఆదినారాయణ, కౌలు రైతు, పెరవలి

మంత్రుల చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ


మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు ధర్మాన, వేణు, ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న 50 మంది మహిళలకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ఆదివారం దేవరపల్లిలో పట్టాలు పంపిణీ చేశారు. 90 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆ లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ, ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేసి, పట్టా అందజేస్తున్నామని చెప్పారు. దేవరపల్లిలో సుమారు 30 ఎకరాల ప్రైవేటు భూములు సేకరించి ఒకేచోట సుమారు 1,500 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని, త్వరలో గృహ నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇంటి స్థలం లేని వారు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి 90 రోజుల్లో స్థలం మంజూరు చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో 20 వేల మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. మంత్రులను ఎమ్మెల్యే వెంకట్రావు ఘనంగా సన్మానించి శ్రీవారి చిత్ర పటాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యులు పొట్రి స్వర్ణలత, చిగురుపల్లి శామ్యూల్, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, పార్టీ నాయకులు మేడిబోయిన గంగరాజు, కారుమంచి రమేష్, కూడిపూడి సతీష్, గారపాటి రమాప్రభ, హైమావతి, సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన దృష్టికి ఇళ్లస్థలాల సమస్య

దేవరపల్లి: మండలంలోని ధుమంతునిగూడెంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయిఈశ్వరరెడ్డి రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (వేణు) దృష్టికి తీసుకువెళ్లారు. ఈ గ్రామంలోని 3.50 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూమిని సేకరించి 130 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశామన్నారు. స్థలాలు పూర్తిగా లోతట్టు ప్రాంతంలో ఉన్నందున అక్కడ ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదని మంత్రులకు వివరించారు. ఈ భూమిని ఆ గ్రామ రైతు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధరకు కొనడానికి ముందుకు వచ్చినందున విక్రయించి, నివాస యోగ్యంగా ఉన్న మెరక భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని మంత్రులను కోరారు. దీనిపై మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఒకసారి భూమికి అవార్డు పాస్ అయ్యాక మరలా కొనుగోలు చేయడానికి అవకాశం ఉండదన్నారు. ఇటువంటి సమస్యను న్యాయపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవలసి ఉందన్నారు.

కరోనా మృతుల కుటుంబానికి రూ.10 లక్షల సాయం


ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదల


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన అక్కాతమ్ముళ్లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం విడుదలైంది. ఈ చెక్కులను ఆదివారం ఇక్కడి మంత్రి క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి తానేటి వనిత లబ్ధిదారులకు అందజేశారు. రాజమహేంద్రవరంలోని జెండా పంజా రోడ్డుకు చెందిన కొల్లు శ్రీవాసవీ ప్రవల్లిక, కొల్లు ఉమాశంకర్‌లకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల విలువైన చెక్కులు మంత్రి అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన అక్కా,తమ్ముళ్లకు తానున్నానంటూ భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ సాయం అందించడం గర్వించదగిన విషయమని ఈ సందర్భంగా మంత్రి వనిత అన్నారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలో 2021లో ఈ అక్కాతమ్ముడి తల్లిదండ్రులిద్దరూ కరోనా వైరస్ బారిన పడి మృతి చెందారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగ్గళ్లపాటి శ్రీనివాస్, కౌన్సిలర్ బత్తి నాగరాజు, నాయకులు వరిగేటి సుధాకర్, గ్రంధి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ముక్కామలలో ఇళ్ల పట్టాల పంపిణీ


ముక్కామలలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ధ్యేయమని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని ముక్కామల జగనన్న లేఅవుట్‌లో ఆదివారం ఆయన 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 18 వేల కుటుంబాలకు జగన్ ప్రభుత్వం సొంతిళ్లను సమకూరుస్తోందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్క సెంటు భూమిని కూడా కొనుగోలు చేసి పేదలకు అందించలేదన్నారు.సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు కూడా బిల్లులు ఇవ్వలేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విమర్శించారు. తమ ప్రభుత్వం స్థలాలు, ఇళ్లు కేటాయించడమే గాకుండా జగనన్న కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్తు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేంద్ర శ్రీను, ముక్కామల పంచాయతీ సర్పంచ్ కేతా త్రిమూర్తులు, పలువురు పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోదుగులమ్మ జాతర ప్రారంభం


మోదుగులమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ అనురాధ, గ్రామస్తులు

తాళ్లపూడి: తాళ్లపూడి గ్రామదేవత అయిన మోదుగులమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో అమ్మవారిని నిలబెట్టారు. అమ్మవారి గ్రామ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, కాంతారా, నల్లమల, అఘోరా, కోయ ట్రూపుల నృత్యాలు, కేరళ వాయిద్యాలు, తీన్మార్, భారీ బాణసంచా కాల్పులతో గ్రామ సేవ అట్టహాసంగా సాగింది. జాతర సందర్భంగా ఊరంగా విద్యుత్తు దీపాల సెట్టింగ్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ సక్కా అనురాధ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నల్లజర్లలో కూచిభొట్ల రచనల ప్రదర్శన

నల్లజర్ల: రిటైర్డు తెలుగు టీచర్ కూచిభొట్ల రామకృష్ణ ప్రసాద్ రచించిన, కొనుగోలు చేసిన పుస్తకాలతో జగన్నాథ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను ఆయన కుమారుడు సోమనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి సేకరించిన వేలాది పుస్తకాలతో తమ ఇంటి వద్దే ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్షలు

గోపాలపురం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 341మంది, ఇంటర్‌లో ప్రవేశానికి 347మంది విద్యార్థినులు హాజరైనట్టు వివరించారు.

వేగేశ్వరపురంలో పూర్వ విద్యార్థుల భేటీ


వేగేశ్వరపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్ 1979 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1979 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక మాంటిస్సోరీ హైస్కూల్ వద్ద నిర్వహించిన ఈ మీట్‌లో పూర్వత విద్యార్థులందరూ నాటి పాఠశాల రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో అప్పన రాజా, పరస రాధాకృష్ణ, అవ్వారు రాధాకృష్ణ, రాజశేఖర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

28న విద్యుత్తు వినియోగదారుల సదస్సు

గోపాలపురం: విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై ఈ నెల 28న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి. వీరబద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో బిల్లుల సవరింపులు, కొత్త సర్వీసుల్లో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ హెచ్చుతగ్గుల వంటి విద్యుత్తు సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.